సాక్షి
చిత్తూరు

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



ఘనంగా గంగ జాతర

కుప్పం: ఏడు గ్రామాల కలయికతో ఏడేళ్లకోసారి జరిగే గంగ జాతర వైభవంగా ప్రారంభమైంది. నాలుగురోజులు జాతర సాగనుంది. - 8లో



బ్రహ్మోత్సవాలకు రండి!

చౌడేపల్లె: అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	24
తిరుపతి	37	25
తిరుమల	32	21
గూడూరు	36	26
నగరి	37	26

న్యూస్‌రీల్

టీటీడీకి 700 బాక్సుల టమాట వితరణ



తిరుమలకు తరలించేందుకు టీటీడీ వాహనంలోకి ఎక్కిస్తున్న టమాట బాక్సులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం హోసూరు ప్రాంతంలో సేకరించిన 700 బాక్సుల టమాటను తిరుమల నిత్యాన్నదాన సత్రానికి పలమనేరు నుంచి టీటీడీ ప్రత్యేక వాహనంలో మంగళవారం పంపారు. తిరుమలలో భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఉచిత భోజనానికి తమవంతు సాయం చేయాలనే తలంపుతో కూరగాయలను సేకరించి పంపుతున్నట్లు స్థానిక శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హోసూరుకు చెందిన దాతలు గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌కు ఆయన కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శ్రీవారి భక్తులు సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలు భద్రం



ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: సైబర్ నేరగాళ్ల నుంచి బ్యాంకు ఖాతా లను కాపాడుకునే విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ రిశాంత్ రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కాలంలో గ్రామీ ణ ప్రాంత ప్రజలు ఆధార్ నంబర్‌తో వేలిముద్ర వేసి బ్యాంకు ఖాతా నుంచి ఎక్కువగా నగదు విత్‌డ్రా చేసుకుంటున్నారన్నారు. ఇలా బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్ ఇవ్వడంతో పాటు వేలిముద్రలు వేయడంతో సైబ ర్ నేరగాళ్లు వీటిని ఆధారంగా చేసుకుని బ్యాంకులోని నగదును కొట్టేస్తున్నారని తెలిపారు. అలాగే వివిధ మార్గాల ద్వారా కూడా అమా యకుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారన్నారు. ఈతరుణంలో ప్రజలు ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం) భద్రం చేసుకోవాలన్నారు. సైబర్‌నేరగాళ్ల నుంచి మోసపోతే పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఎస్జీటీలుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ తెలిపారు. బీఈడీలో స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ జనర ల్, రెండు సంవత్సరాల స్పెషల్ ఎడ్యుకేషన్ డిప్లొమా చేసిన వారు అర్హులన్నారు. అర్హత ఉన్న ఎస్జీటీలు ఈ నెల 26వ తేదీన సాయంత్రం 4 గంటల లోపు సర్వీస్ రిజిస్టర్లు, సర్టిఫికెట్లతో డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసు

పెద్దపంజాణి: మొదటి విడత మనబడి నాడు-నేడు రికార్డులు అందజేయని స్కూల్ అసిస్టెంట్ ఎం.వెంకటరమణకు మంగళవారం ఎంఈఓ హేమలత షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. చలమంగళం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ గతంలో పెద్దకాప్పల్లి ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తూ నాడు-నేడు పనులు రికార్డులను నిర్వహించేవాడు. అనంతరం 2020 ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో చలమంగళం పాఠశాలకు వెళ్లాడు. అయితే ఇంతవరకూ అందుకు సంబంధించిన రికార్డులను తనకు అందజేయలేదని పెద్దకాప్పల్లి పాఠశాల హెచ్‌ఎం ఎంఈఓ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఈఓ మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేడు చేనేత మగ్గాల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో చేనేత రంగం అభివృద్ధిలో భాగంగా ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి చేతుల మీదుగా బుధవారం చేనేత కార్మికులకు మగ్గాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా చేనేత నాయకుడు నీలా పండరీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల కు నిర్వహిస్తారన్నారు. పంపిణీ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చేనేత కార్మికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


పిండేస్తున్నారు!

- చిత్తూరు మండలంలోని ఓ డీడీఓ ఇటీవల ఆ పంచాయతీలో జరిగిన పనులకు సంబంధించి ఆడిట్ చేశారు. ఆడిట్ చేసినందుకు రూ.30 వేలు ఇవ్వాలని సర్పంచ్‌ను ఆ డీడీఓ డిమాండ్ చేశారు. ఇవ్వకపోవడంతో గ్రేడ్ -5 కార్యదర్శి ద్వారా బలవంతం చేయించారు. పోరు పడలేక సర్పంచ్ తన కుటుంబ సభ్యుడి నుంచి డీడీఓకు రూ.30 వేలు ఫోన్ పే చేశారు. ఆ పంపిన వివరాలను అతను నేరుగా జిల్లా యంత్రాంగానికి పంపి, ఫిర్యాదు చేశాడు.

- చిత్తూరు మండలంలోని మరో పంచాయతీ సర్పంచ్ బిల్లులు పెట్టేందుకు నానతంటాలు పడుతున్నారు. నిత్యం డీడీఓ చుట్టూ తిరుగుతున్నారు. బిల్లు.. బిల్లుకు డబ్బులు ఇవ్వందే బిల్లు పెట్టడం లేదని, ట్రెజరీ అధికారులకు ఇవ్వాలని రూ.వేలల్లో వసూలు చేసుకుంటున్నారని ఆ సర్పంచ్ సిబ్బంది వద్ద వాపోయారు.

- గుడిపాల మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ డీడీఓ వసూళ్లలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రతి పనికి కాసులు ముట్టందే పని జరగడం లేదు. ఇటీవల ఓ బిల్లు పెట్టేందుకు రూ.15 వేలు తీసుకున్నరంటూ ఓ అధికారి ఎదుట సర్పంచ్, మరో పంచాయతీ కార్యదర్శి వాపోయారు. ఇవి మచ్చుకు మాత్రమే.. ఇలాంటి జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నాయి.

- బిల్లు పెడితే..కాసుల దందా..
- రూ.5 వేల నుంచి రూ. 30 వేల వరకు గుంజుడు
- ట్రెజరీ, ఆడిట్ పేరుతో మరింత బాధుడు
- దందా సాగిస్తున్న కొందరు డీడీఓలు



జిల్లా పంచాయతీ వివరాలివీ..

మొత్తం మండలాలు	31
పంచాయతీలు	697
సచివాలయాలు	612
మేజర్ పంచాయతీలు	11
పంచాయతీ కార్యదర్శులు	665
డీడీఓలు	612

చిత్తూరు రూరల్/గుడిపాల: పంచాయతీ సర్పంచ్‌లను కొందరు డీడీఓలు (డ్రాయింగ్ డిస్బర్సింగ్ అధికారి) పిండేస్తున్నారు. బిల్లు పెడితే కాసులు కొల్లగొడుతున్నారు. బిల్లు నగదు బట్టి రూ. వేలల్లో దోచుకుంటున్నారు. ప్రతి బిల్లుకు రూ 5. వేల నుంచి రూ. 30 వేల వరకు గుంజుకుంటున్నారు. ట్రెజరీ, ఆడిట్ అధికారులతో మరింత వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యటనకు వస్తే డీజిల్ ఖర్చులంటూ రూ. 5వేలు నొక్కేస్తున్నారు. ఈ దందాలో కొందరు డీడీఓలు రెచ్చిపోతున్నారని, సర్పంచ్‌లు మింగలేక, కక్కలేక మిన్నకుండిపోతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

చిత్తూరుజిల్లాలో 31 మండలాలున్నాయి. ఈ మండలాల్లో సచివాలయాలు 612 సచివాలయాలు, 697 పంచాయతీలుండగా 11 మేజర్ పంచాయతీలు, 665 మంది పంచాయతీ కార్యదర్శులు, 612 మంది డీడీఓలు పనిచేస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇందులో గ్రేడ్-1 నుంచి 4 కార్యదర్శులను సచివాలయ డీడీఓలుగా నియమించింది. అయితే దీని ఆసరా చేసుకుని కొందరు డీడీఓలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. పంచాయతీ నిధులను కాజేస్తున్నారు. లేకుంటే సర్పంచ్‌ల జేబులకు కత్తెర వేస్తున్నారు. మిగిలిన పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

దందా ఇలా...

2019 ముందు వరకు పంచాయతీ కార్యదర్శులు బిల్లుకు 10 శాతం వసూలు చేసేవాళ్లు. అప్పట్లో పేపర్లపై, క్యాష్‌బుక్‌ల ద్వారా బిల్లుల చెల్లింపు ప్రక్రియ నడిచేది. జమ, ఖర్చులన్నీ రెండు, మూడేళ్లకోసారి ఆన్‌లైన్ చేసేవారు. దీంతో కమిషన్‌ను అప్పటి సర్పంచ్‌లు పెద్దగా పట్టించుకునేవారు కారు. ప్రస్తుత ప్రభుత్వం పారదర్శక పాలనకు పెద్ద పీట వేసింది. బిల్లుల చెల్లింపును ఆన్‌లైన్‌కు ముడిపెట్టింది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసే పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఆ బాధ్యతలను సచివాలయాలు వచ్చిన తరువాత డీడీఓల చేతికి అప్పగించింది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. నగదు ఆధారంగా బిల్లుకు రూ. 5 వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒప్పందం కుదరని పక్షంలో బిల్లుల మంజూరుకు కత్తెర పెడుతున్నారు. గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు(సచివాలయం ద్వారా ఎంపికైనా వారు)ని తిప్పించుకుంటున్నారు. సర్పంచ్‌ల నుంచి కమీషన్ తీసి ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో చేసేదీ లేక..కొంత మంది పంచాయతీ కార్యదర్శులు అడిగినంత ఇచ్చి బిల్లులు చేయించుకుంటున్నారు. వారు అడిగింత ఇవ్వకుంటే తాము డీడీఓల వద్ద మాటలు పడాల్సి వస్తోందని పలువురు కిందిస్థాయి కార్యదర్శులు వాపోతున్నారు. ఇక ట్రెజరీ అధికారుల పేరుతో మరింత వసూలు అదనమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడిట్ పేరుతో ఏటా రూ.30 వేల వరకు మామూళ్లు తప్పడం లేదని సర్పంచులు, కిందిస్థాయి కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు గ్రామాల పర్యటనకు వస్తే..డీడీఓలు డీజిల్‌కు రూ. 5 వేలు ఇవ్వాల్సి వస్తోందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కూడా రూ. 500 నుంచి రూ.వెయ్యి వరకు ఫిక్స్ చేశారని ఫిర్యాదులు వస్తున్నాయి. పంచాయతీ అనుమతులు ధ్రువీకరణ పత్రం మంజూరుకు రూ.వందల్లో ఇచ్చుకుంటున్నామని పలువురు వాపోతున్నారు. ఇలా ప్రతి బిల్లుకు కాసులు కాజేయడంతో సర్పంచ్‌లు, కింది స్థాయి పంచాయతీ కార్యదర్శులు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీల్లోని డీడీఓల ఆగడాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

నేరుగా ఫిర్యాదు చేయండి



"పంచాయతీ బిల్లులు పెట్టాలంటే ..ఎవరైనా కాసులడిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఆధారాలతో సహా నిరూపిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఎవరు కూడా బిల్లుకు కాసులివ్వాల్సిన పనిలేదు. డీడీఓలను పిలిచి ఈ విషయమై హెచ్చరిస్తాను.

– లక్ష్మి, డీపీఓ, చిత్తూరు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



బైరెడ్డిపల్లెలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ టీచర్లు

పలమనేరు: ఇటీవల ఉద్యోగాలు పొందిన బైరెడ్డిపల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయులు (1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు) మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయనకు ఎన్నటికీ రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప హాజరయ్యారు. సుదీర్ఘ పోరాటాల తర్వాత నాటి పాదయాత్రలో ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సాయిలీల, ఎంపీడీఓ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న వసతి దీవెన

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న వసతి దీవెన కార్యక్రమం జిల్లాస్థాయి కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జగనన్న వసతి దీవెన పథకంలో 34,133 మంది విద్యార్థులకు 30,912 మంది తల్లుల ఖాతాల్లో రూ.33.29 కోట్లను ప్రభుత్వం జమ చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్నత చదువులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మామిడి రైతులకు సాంకేతిక సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్

సాక్షి, చిత్తూరు: మామిడి రైతులకు అవసరమైన సాంకేతిక సహాయ సహకారాలు అందిస్తామని, ఇప్పటికే జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని ఉద్యానశాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం జిల్లా సచివాలయం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్‌తో కలసి మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులతో వేర్వేరుగా సమావేశమై మామిడి పంట సీజన్‌లో జిల్లాలోని తాజా పరిస్థితిపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ పక్వానికి వచ్చిన మామిడి పంటను మాత్రమే దశల వారీగా కోయాలని, తద్వారా ఒకేసారి దిగుబడి ఎక్కువ కాకుండా రైతులకు సరియైన ధర అందేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో పండించే తోతాపురి రకానికి ఎక్కువ ప్రాధాన్యత ఉందని, రైతులందరూ ఒకేసారి పక్వానికి వచ్చినా రాకపోయినా పంటను కోయడంతో ధరలు తగ్గే ప్రమాదం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ మాట్లాడుతూ మామిడి పంటకు సరైన ధర వచ్చేందుకు రైతులు కూడా అధికారుల సూచనలు, సలహాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి సహాయ సహకారాలైనా అందించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందన్నారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,08,428 హెక్టార్లలో 5,86,563 మెట్రిక్ టన్నుల మామిడి పంట దిగుబడి రానుందని చెప్పారు. రైతు నాయకులు జయచంద్ర చౌదరి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగేశ్వరరాజు, జగదీష్‌రెడ్డి, వేణు, వాసు, భాస్కర్, మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని, ధర నిలకడగా ఉండేలా ధరల నిర్ణయ కమిటీని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని విన్నవించారు. ధరల వివరాలను ప్రదర్శించాలని, మామిడి పంటకు బీమా అందేలా చూడాలన్నారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని కోరారు. టీటీడీ వారు కూడా మామిడి జ్యూస్ ను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. గుజ్జు పరిశ్రమల యజమానులు గోవర్ధన్ బాబీ, బాబు రెడ్డి, చంద్రశేఖర్, అమరనాథ్, శివకుమార్, బషీర్, సమీర్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో గుజ్జు పరిశ్రమలకు అవసరమైన మామిడి పండ్లను క్రషింగ్ మొదటి దశలో కృష్ణా జిల్లా నుంచి దిగుబడి చేసుకుంటున్నామన్నారు. సీజన్ మొదలైన వెంటనే జిల్లాలో పండే మామిడి పంటను మాత్రమే క్రషింగ్ చేస్తున్నామన్నారు. గుజ్జు ఎగుమతిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఉద్యాన శాఖాధికారులు దశరథరామిరెడ్డి, రవిచంద్రబాబు, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

పథకాలు చేర్చే బాధ్యత అధికారులదే



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, చిత్రంలో డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్:అట్టడుగు వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేర్చే బాధ్యత అధికారులదేనని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశ మందిరంలో ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి మనిషికీ జీవించే హక్కు ఉందన్నారు. వీరికి ఆరోగ్యం, విద్య వంటి సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. అట్టడుగు వర్గాల లబ్ధిదారులకు పథకాలు అందుతున్న తీరు, ఈ పథకాలు వారికి ఎలా ఉపయోగపడుతున్నాయననే విషయంపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చౌక దుకాణాల నుంచి ప్రతి ఇంటికి సరుకులు సరఫరా చేసే వాహనం ద్వారా అందజేస్తున్నారన్నారు. ఇది ఒక మంచి పరిణామమన్నారు. అటవీ ప్రాంతాల్లో పలు ఫలాలను పొందే హక్కు గిరిజనులకు ఉందని, ఆ హక్కు అమలు అయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేలా వైద్యశాఖ పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజల కోసమే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. ఈ పథకాలను అర్హులైన వారికి అధికారులు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా పలు హాస్టళ్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాల్లో పరిస్థితులను వారికి అనుకూలంగా తీర్చిదిద్ది మంచి వాతావరణం, ఆహారం, దుస్తులు, విద్య కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: సైబర్ క్రైమ్‌పై ప్రజలను అప్రమత్తం చేసి, వారు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై నిఘా పెంచాలన్నారు. సైబర్ కేసు ల రికవరీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాంకేతికంగా జరిగే తప్పిదాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. సైబర్‌నేరగాళ్లు చేస్తున్న దోపిడీ రకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పా రు. లోన్‌యాప్ వలలో ప్రజలు పడకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ఈ విషయంలో బాధితులే నేరుగా ఫిర్యాదు ఇచ్చేలా చూడాలన్నారు. లేకుంటే సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎర్రచందనం, సారా తయారీపై ఉక్కుపాదం మోపాలని సూచించారు గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలన్నారు. చోరీలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ.. పలు పెండింగ్ కేసులపై దృష్టిసారించాలన్నారు. రాత్రి పూట గ్రామాల పర్యవేక్షణను పగడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మసాక్షిగా పనిచేస్తున్నా!

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: 'నా ఆత్మసాక్షిగా పనిచేస్తున్నా.. ఏతప్పూ చేయలేదు.. నాకు ఎవరినీ కించపరచే అలవాటు లేదు.. సీఎం జగనన్నను వ్యతిరేకించే శక్తులపై తిరగబడతాను. తప్ప ఎలాంటి కక్ష లేదు' అని ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. శతృత్వాన్ని ప్రోత్సహించే చంద్రబాబుకు తానెప్పుడూ వ్యతిరేకినేనని స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని అగ్గిచేనుపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడకుండా నీతి నిజాయతీగా పనిచేస్తున్న తనపై ఏదోరకంగా బురదజల్లుతున్నారన్నారు. గతంలో అభివృద్ధిని చూడాలని, ఈ నాలుగేళ్లలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి, ఎవరు మెరుగ్గా చేశారో గుర్తించాలని సూచించారు. ఏ తప్పూ చేయని తనపై ఎల్లోమీడియా తప్పుడు రాతలు ఎందుకు రాస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సారా తయారీని అరికట్టడం తాను చేసిన తప్పా అని నిలదీశారు. గతంలో పాలకులు లాగా ప్రతి పనికీ లంచాలు తీసుకునేవారని, అలా చేయకుండా ప్రజలకు పారదర్శకంగా పనులు చేసిపెట్టడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. సీఎం జగనన్న దయతో తనకు డిప్యూటీ సీఎం పదవి వరించిందని, ఇది చూసి ఓర్వలేక, పేదల రాజకీయ ఎదుగుదలకు కలంకంగా మారిన టీడీపీ తనను కించపరచేలా ప్రవర్తిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎస్సీననే చులకన భావంతో కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు సృష్టిస్తున్నాయని చెప్పారు. 41 ఏళ్లుగా అన్నివర్గాలతో మమేకమై పనిచేస్తున్న తాను ఎవరికీ వ్యతిరేకినికానని చెప్పారు. కులానికి సంబంధించిన పేపర్లకు పేదవాళ్ల బాగోగులు పట్టవని ఎద్దేవా చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, సీనియర్ నాయకులు ధనంజయరెడ్డి, సుబ్రమణ్యం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మనో నేత్రంతో దర్శించి..మనసు పులకించి





కళ్లు కనిపించకపోయినా.. ఆ శ్రీనివాసుడిని గోవిందా..? అని గొంతెత్తి స్మరించడానికి మాటలు రాలేకపోయినా బాధపడలేదు. సప్తగిరులను అధిరోహించడానికి కాళ్లు సహకరించకపోయినా కుంగిపోలేదు. తిరుమలేశుడికి రెండు చేతులెత్తి మొక్కాలని తాపాత్రయపడ్డా.. వంకర్లు తిరిగిన చేతులు రాలేదని చింతించలేదు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని దివ్యమంగళరూపాన్ని చూసి తరించాలని మనసు ఉబలాటపడినా కళ్లు కనిపించలేదని కుమిలిపోలేదు. అవయవాలు సహకరించకపోయినా.. సప్తగిరులను దిగ్విజయంగా అధిరోహించారు. మనోనేత్రంతోనే శ్రీవారిని దర్శించి తన్మయత్వం పొందారు. అద్భుతమైన దర్శనభాగ్యం కలగడంతో ఆనందడోలికల్లో మునిగితేలారు. తమ జన్మధన్యమైందని.. సహకరించిన చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ఆర్‌వైఏ(రాజస్థాన్ యూత్ అసోసియేషన్) మద్రాస్ మెట్రో ట్రస్ట్ ఫుడ్ బ్యాంక్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.. తమిళనాడుకు చెందిన దివ్యాంగులు.

– తిరుమల

జిల్లాలో 50 క్రీడా శిబిరాలు ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవిలో జిల్లాలో 50 క్రీడా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే ఒకటి నుంచి 30వ తేదీ వరకు క్రీడా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న బాల, బాలికలు చిత్తూరు డీఎస్ఏ స్టేడియం, సంబంధిత మండలాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడాశిబిరాలను వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా మూలాక్షమ్మ జాతర

- ఏడేళ్లకోసారి ఏడు గ్రామాల కలయికతో జాతర
- భారీగా తరలివచ్చిన జనం


ఆలయం వద్ద భక్తుల రద్దీ


ములాక్షమ్మ జాతర సందర్భంగా గెరిగ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కుప్పం: ఏడు గ్రామాలు కలయకతో ఏడేళ్లకోసారి జరిగే ములాక్షమ్మ గంగ జాతర వైభవంగా జరిగింది. మున్సిపల్ పరిధిలోని బేవవపల్లె, పరమసముద్రం, వడ్డిపల్లె, చీలేపల్లె, రూరల్ పరిధిలోని వెందుగంపల్లె, పైనాసి, గోనుగూరు గ్రామాల కలయకతో ఏడేళ్లకోసారి జరిగే గంగ జాతర నాలుగు రోజులుగా కొనసాగుతోంది. మంగళవారం ప్రత్యేకంగా అన్ని గ్రామాలోని దేవాలయాల్లో భక్తులు పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. బేవనపల్లెలోని ములాక్షమ్మ దేవాలయంలో ఏడేళ్లు మూసివేసి ఉంటుంది. జాతర సందర్భంగా మాత్రమే ఆలయాన్ని తెరిచి, పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలోనే ఏడు గ్రామాల ప్రజలు పొంగళ్లు పెట్టి, దీపారాధన చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

నేడు అమ్మవారికి జంతు బలులు

బుధ, గురువారాల్లో భక్తులు అమ్మవారికి జంతు బలులిచ్చి మొక్కులు చెల్లింకుంటారు. బంధుమిత్రులతో కలసి విందు భోజనాలు చేస్తారు. అరుదుగా జరిగే జాతర కావడంతో బంధుమిత్రులతో ఏడు గ్రామాలు కళకళలాడాయి.

క్లుప్తంగా

దాడి కేసులో ఆరుగురి అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్ఐ

ఐరాల: కత్తితో దాడి చేసిన కేసులోఆరుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ, ఎస్ఐ కథనం మేరకు.. కుమ్మరపల్లెకు చెందిన గుర్రప్ప ఆచారి, గోవింద ఆచారి అన్నదమ్ములు. వీరికి గత కొన్నేళ్లుగా దారి విషయమై వివాదం ఉంది. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన గురప్ప ఆచారి కొడుకు రాజేష్, మరో ఐదుగురు దారి విషయమై ఘర్షణ పడి, కత్తితో మనిరాజుల ఆచారి, గోవింద ఆచారి కుటుంబ సభ్యులైన వరలక్ష్మి, పృధ్విరాజ్, వనమ్మ, మునిరాజుల ఆచారిపై దాడి చేసిన విషయం తెలిసిందే. బాధితుడు పృధ్విరాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ, ఎస్ఐ బృందం పాలకల సంతగేటు బస్టాప్ వద్ద కుమ్మరపల్లెకు చెందిన ఈ.రాజేష్, ఈ.రమేష్, పాలకల సంతగేటు వాసులు వీ.ధనంజయ ఆచారి, ఏ.కృష్ణమాచారి, పీలేరుకు చెందిన కే. మనోహరఆచారి అలియాస్ మణి, ఎన్. మునిరత్నంను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

ఇక లోకోస్ యాప్‌లో డ్వాక్రా లావాదేవీలు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

పలమనేరు: జిల్లాలోని డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలు, సమగ్ర వివరాలు ఇకపై లోకోస్ యాప్‌లో పొందుపరిచి, ఆ యాప్ ద్వారా సాగాలని డీఆర్‌డీఏ పీడీ తులసి వెలుగు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో 11 మండలాలకు చెందిన వెలుగు ఏపీలు, ఏపీఎంలు, సీసీలకు లోకోస్ యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకోస్ యాప్ సేవలను అన్ని మండలాల్లో విస్తృతం చేయాలన్నారు. ఈ యాప్‌నకు రాష్ట్రంలోనే తొలిసారి చిత్తూరుజిల్లాలో అంకురార్పణ జరిగిందన్నారు. ప్రస్తుతం యాప్‌లో వివరాల నిక్షిప్తం చేస్తున్నందున సభ్యురాళ్ల వివరాలను సకాలంలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ యాప్‌తో పేపర్‌లెస్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ముఖ్యంగా ఆర్థికలావాదేవీల్లో ఎటువంటి అవకతవకలకు తావుండదన్నారు. దీనిపై గ్రామస్థాయిలో గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్, యాప్ ట్రైనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో మంగళవారం ట్రాన్స్‌కో డివిజన్ల పరిధిలోని సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,332 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరు పరిధిలో విద్యుత్ చౌర్యం, అపరాధరుసుం పరంగా మొత్తం 653 సర్వీసులకు రూ.14.55 లక్షలు అపరాధరుసుం, జరిమానా రూపంలో చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, దాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కుప్పం రెవెన్యూ కార్యాలయంలో రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. మొదటి దశలో కుప్పం మండలంలో పూర్తి చేసిన రీసర్వే పనులకు సంబంధించి రాళ్లనాటే ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే బాధ్యత అధికారులదే అన్నారు. రెండో దశ రీ సర్వే పనులను పరిశీలించారు. వివిధ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మిగతా మండలాల్లోను సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, తహసీల్దార్ పార్వతి పాల్గొన్నారు.

లీజుకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీకి సంబంధించిన ఖాళీస్థలాలను ఔత్సాహిక వ్యాపారవేత్తలకు లీజు లేదా నెలవారి అద్దె ప్రతిపాదికన ఇవ్వనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండ్‌లో ఉన్న 1.28 ఎకరాలు, డిపో వద్ద బిట్-1లో 1.34 ఎకరాలు, బిట్-2లో 1.08 ఎకరాల ఖాళీ స్థలాలను పీపీపీ (ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్పు) ప్రాతిపదికన 33 ఏళ్ల లీజు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కల్యాణ మండపాలు, కారు పార్కింగ్, ఇండోర్ స్టేడియం తదితరాలకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. ఇందుకు సంబంధించి ఈనెల 28న స్థానిక డిపో వద్ద సమావేశం ఏర్పాటు చేసినట్లు అందులో తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: రూ.లక్ష విలువ చేసే కర్ణాటక మద్యాన్ని మంగళవారం టూటౌన్ పోలీసులు సీజ్ చేశారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. సంతపేటలోని ఇందిరానగర్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మంగళవారం మధ్యాహ్నం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ మద్యం కలిగిన జానకారపల్లెకు చెందిన హేమచంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.లక్ష విలువ చేసే 28 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక ద్విచక్రవాహనం, కారును కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. విక్రేత హేమచంద్రపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ప్రసాద్, నాగరాజు, సిబ్బందిని ఆయన అభినందించారు.

ఆర్బీకేల పనితీరు భేష్

శాంతిపురం: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పనితీరు బాగుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం చిన్నారిదొడ్డి, గుంజార్లపల్లె ఆర్బీకేలను సందర్శించిన ఆయన జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా సాగులోని రాగి పంటలను పరిశీలించారు. ఆర్బీకేల ద్వారా అందుతున్న సేవలు, పథకాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అప్పోజీ, ఆర్బీకేల ఇన్‌చార్జిలు సురేష్‌రెడ్డి, గోపీనాథ్, నరేష్, రాజేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

మృత్యుంజయేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు రండి!

- మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం


మహాభారత యజ్ఞానికి రావాలని మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానపత్రిక ను అందిస్తున్న కొత్తకోటవాసులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో ఉన్న అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మే 7వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన్ని మంగళవారం అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి బృందం కలిసింది. ఆహ్వాన పత్రికను అందజేసింది. అనంతరం అర్చకులు స్వామివారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి, మంత్రి దంపతులను ఆశీర్వదించారు. అలాగే ఏ.కొత్తకోట గ్రామంలో ఈ నెల 30వ నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించనున్న మహాభారత యజ్ఞం కార్యక్రమానికి రావాలని నేతలు మహమ్మద్‌షఫీ, చిన్నా, సదాశివ గ్రామస్తులు కలిసి మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

కుప్పం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం


వృద్ధుడి సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: కుప్పం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలారు, కొసిగానిపల్లె, గిడ్డేగానిపెంట, షాహీపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 585 గృహాలను సందర్శించి, వారికి జగనన్న పాలనలో పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలను పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ చంద్రబాబు 35 ఏళ్లుగా కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నా యువతకు శాశ్వత ఉపాధి, తాగు, సాగునీటికి పరిష్కారం చూపలేక పోయారని విమర్శించారు. అభివృద్ధి చేయక పోగా, పాలారు ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణానికి దివంగత నేత రాజశేఖరరెడ్డి శ్రీకారం చుడితే తమిళ ప్రభుత్వంతో కలిసి కోర్టుకు పోయి, ఆపిన ఘనత బాబుకు దక్కిందన్నారు. జగనన్నకు కుప్పం జనంపై మమకారం ఉందని, ఈ నేపథ్యంలోనే మళ్లీ పాలా ప్రాజెక్టు నిర్మాణానికి హామీ ఇచ్చారని చెప్పారు. కుప్పాన్ని పోలీసు, రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. త్వరలో కుప్పానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, గ్రామీణాభివృద్ధికి రూ. వంద కోట్ల నిధులు రానున్నాయని చెప్పారు. ఇవన్ని చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుర్తుకు రాక పోగా, గ్రామాల్లో కాలువల నిర్మాణం చేపడుతుంటే తొట్టి గ్యాంగును పంపించి ఆపే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, పార్టీ మండల కన్వీనర్ మురుగేష్ పాల్గొన్నారు.

సీఎంసీలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు


సీఎంసీలో ఏర్పాటు చేసిన స్టాల్

గుడిపాల: మండలంలోని చీలాపల్లె సమీపంలో ఉన్న సీఎంసీ ఆస్పత్రిలో మంగళవారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. 'ప్రపంచస్థాయిలో ఫార్మసీ-భారతదేశం స్థానం' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీకి సంబంధించిన స్టాళ్లను ప్రదర్శించి, వివిధ మందులపై వచ్చిన వారికి అవగాహన కల్పించారు. డాక్టర్ అలెక్స్ రోగులకు వ్యాధులకనుగుణంగా ఆహార అలవాట్లను వివరించారు. సీఎంసీ ఆస్పత్రి అడ్మిన్ ప్రిన్స్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చట్టాల అమలులో అలసత్వమొద్దు


మాట్లాడుతున్న ఆనంద్

చిత్తూరు కలెక్టరేట్ : బాలకార్మిక చట్టాల అమలులో అలసత్వం వహించవద్దని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఆర్‌జీ ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు అరికట్టడం, బాల కార్మిక చట్టం అమలు చేయడం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. చిత్తూరు జిల్లాలో గత సంవత్సరం కమిషన్ సమావేశం నిర్వహించామన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ తదితర అంశాలకు సంబంధించి ఆ శాఖ అధికారుల నుంచి నివేదికను సేకరించి కమిషన్‌కు నివేదించడం జరుగుతుందన్నారు. తద్వారా కమిషన్ బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్‌పై రూపొందించిన నిర్ణయాలను జిల్లా యంత్రాంగానికి పంపుతుందని వెల్లడించారు. దేశంలో 51 ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద చైల్డ్ లేబర్, చైల్డ్ బెగ్గింగ్ వంటివి పూర్తిగా నిర్మూలించడానికి కమిషన్ చర్యలు చేపడుతోందన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

దిశా పోలీస్ స్టేషన్ సేవలు సందర్శన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన దిశా పోలీస్ స్టేషన్ సేవలు పలు ప్రాంతాల్లో సందర్శిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కమిషన్‌కు సంబంధించి బెంచ్‌లను ఏర్పాటు చేసి ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తామన్నారు. బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్‌పై నిరంతర పర్యవేక్షణ ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ శాఖాధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తవణంపల్లె: మండలంలోని మడవనేరి కృష్ణాపురం సమీపంలో యువకుడు(21) ఉరివేసుకుని మృతి చెందినట్లు తవణంపల్లె ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని మల్లకుంట పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన గీత కుమారుడు కార్తీక్(21) ఆటో డ్రైవర్. ప్రతి రోజు తవణంపల్లెలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న ప్రైవేటు డెయిరీకి పలు గ్రామాల్లో రైతుల నుంచి పాలు సేకరించి ఆటోలో పాలు తోలేవాడు. బుధవారం కొంత మంది రైతుల నుంచి పాలు సేకరించిన క్యాన్లను ఆటోలో వేసుకుని బయలుదేరాడు. మడవనేరి కృష్ణాపురం వద్ద రోడ్డు పక్కన ఆటో ఆపి వేశాడు. ఆ దారిలో పొలంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి, తవణంపల్లె పోలీసులకు సమాచారం అందజేశారు. దీనితో తవణంపల్లె ఎస్ఐ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని, శవాన్ని కిందకు దింపి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేట కేసులో ముగ్గురి అరెస్టు

తవణంపల్లె: మండలంలోని స్వస్తిక్ నగర్ సమీపంలో ఉన్న పాయిలగుట్ట వద్ద అడవి పందుల వేట కోసం కరెంటు తీగలు అమర్చిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పాయిలగుట్ట వద్ద అడవి పందుల వేట కోసం కొందరు కరెంటు తీగలు లాగారు. ఈ తీగలు తగిలి ఎం.బోయపల్లెకు చెందిన సి. మేఘనాథం మృతి చెందిన విషయం విదితమే. చిత్తూరు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి కేసు దర్యాప్తును వేగవంతం చేసి రెండు రోజుల్లో కేసును ఛేదించారు. అడవి పందుల వేట కోసం కరెంటు తీగలు అమర్చిన నిందితులు కె.ఢిల్లెయ్య, పాలేటి నాగరాజు, పాకాల మొగిలప్పను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 13 అమలు విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు పూర్తి సహాయ సహకారాలు అందివ్వాలన్నారు. వైకల్యం ఉన్నవారు ఎటువంటి వివక్ష లేకుండా హక్కులను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, విద్యాసంస్థల్లో వివక్ష రహితమైన పరిసరాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో వికలాంగుల సంక్షేమానికి ఒక కాంపిటెంట్ అథారిటీని నియమించాలన్నారు. డీఈఓ విజయేంద్రరావు, పీడీలు నాగశైలజ, రాధమ్మ, ఎల్‌డీఎం శేషగిరి రావు, డాక్టర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


వైద్య ఆరోగ్యశాఖలో పలు సంస్కరణలు

రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పలు సంస్కరణలు తీసుకువస్తోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు అను గుణంగా మెడికల్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రకాశం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ ఆలయమైన కీలపట్ల కోనేటిరాయస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి కోనేటిరాయస్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ శుద్ధి పనులు చేపట్టినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన లేపనాన్ని ఆలయ గోడలకు పట్టించి, నీటితో శుభ్రం చేశారు. ఈ నెల 27వ తేదీన అంకురార్పణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, వచ్చే నెల 7వ తేదీన పుష్పయాగంతో ముగుస్తాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు పాలనలోనే విజయా డెయిరీ మూత


మాట్లాడుతున్న విజయా డెయిరీ కార్మికులు

చిత్తూరు రూరల్: చంద్రబాబు పాలనలో విజయా డెయిరీని మూయించి, కార్మికులను రోడ్డుపాలు చేశారని ఆ డెయిరీ కార్మికుల సంఘం నాయకులు జానం గంగిరెడ్డి, వెంకటరమణ, పీడీకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒకప్పుడు విజయా డెయిరీకి గొప్ప పేరు ఉండేదన్నారు. హెరిటేజ్ డైయిరీ పురుడు పోసుకున్న తర్వాత పాలు సరఫరా తగ్గిందనే కుంటి సాకుతో టీడీపీ ప్రభుత్వం, పాలకవర్గం కుమ్మక్కై 2002లో విజయా డెయిరీని మూతవేసిందన్నారు. డెయిరీ మూసివేస్తున్నట్లు అప్పట్లో కార్మికులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వందలాది మంది కార్మికులను రోడ్డు పాలు చేసిందన్నారు. 400 మందికిపైగా వీఆర్‌ఎస్ ఇవ్వగా, 150 మందికి వీఆర్‌ఎస్ ఇవ్వలేదన్నారు. అప్పటి నుంచి జీతాల కోసం గొంతు చించుకుంటున్నా పట్టించుకునే వారులేరన్నారు. అయితే 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వేసిన ఓ కమిటీ పూర్వపరాలను పరిశీలించిందన్నారు. ఆ నివేదికలో కార్మికులకు జీతాలు చెల్లించాలని, డెయిరీన్ని పునఃప్రారంభించాలని, మూసివేతకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొందన్నారు. అమూల్ డెయిరీని తాముస్వాగతిస్తున్నామని, తమ జీతాల మంజూరుకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే కూడా డెయిరీ కార్మికులకు సహకారం అందించారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్మికులు చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాలో గెజిటెడ్ ఆఫీసర్లు


ధర్నాలో పాల్గొన్న గెజిటెడ్ ఆఫీసర్లు

చిత్తూరు కలెక్టరేట్ : తమ డిమాండ్ల పరిష్కారం కోసం పలు శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేసిన ధర్నాలో గెజిటెడ్ ఆఫీసర్లు పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలు శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను రెట్టింపు చేసి మేలు చేస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను టీడీపీ హయాంలో ఏజెన్సీలకు అప్పజెప్పి మోసం చేసిన విషయం అందరికి తెలిసిందే. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉన్న చాలా మందికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న ధర్నాలో ఎటువంటి సంబంధం లేని గెజిటెడ్ ఆఫీసర్లు హాజరుకావడం దేనికి సంకేతమని పలువురు కలెక్టరేట్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సమగ్రశిక్ష శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హోదాలో ఉన్న మధుసూదనరావు, పూతలపట్టు పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్న ప్రసాద్ ధర్నాలో ఎందుకోసం పాల్గొన్నారోనని పలువురు ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.